పంటలు ఎండుతున్నా పట్టదా?

నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోండి

ఇరిగేషన్ ఈఎన్సీకి మధుసూదనాచారి ఫోన్

ఇరిగేషన్ ఈఎన్సీతో మాట్లాడుతున్న మధుసూదనాచారి

జయశంకర్ భూపాలపల్లి, మార్చి 1 (నమస్తే తెలంగాణ): భూపాలపల్లి నియోజకవర్గంలో సాగు నీటి సమస్య తీవ్రంగా ఉన్నదని, నీళ్లు లేక పంటలు ఎండిపోతున్నా పట్టించుకోరా? అని శాసన మండలిలో ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. భూపాలపల్లి నియోజకవర్గానికి చెందిన పలువురు రైతులు శనివారం సిరికొండ మధుసూదనాచారిని కలిశారు. నియోజకవర్గంలో సాగునీటి సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. పంటలు ఎండిపోతున్నా పాలకులు ఏ మాత్రం స్పందించడం లేదని, ఇటీవలే మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి నీటికోసం ధర్నా చేశారని గుర్తుచేశారు. అయినా అధికారులు, ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. వెంటనే సాగునీరు అందించి రైతులను ఆదుకోవాలని ఇరిగేషన్ ఈఎన్సీ శంకర్‌కు ఫోన్‌చేసి సూచించారు. డీబీఎం-16, డీబీఎం-18, డీబీఎం-38 కాల్వల్లో నీటి విడుదల స్థాయిని పెంచాలని, తద్వారా చలివాగు, పెద్ద వాగు ద్వారా పొలాలకు నీరు అందేలా చూడాలన్నారు. డీబీఎం- 38 నుంచి చివరి ఆయకట్టు వరకు నీరు అందించాలని కోరారు. ముచ్చర్ల నాగారంలో లెవల్ తూము ద్వారా నీటిని పెద్దవాగుకు విడుదల చేసి పంటలను కాపాడాలని, అన్నంపెట్టే రైతన్నల ఆక్రందనలను ప్రభుత్వం అర్థం చేసుకోవాలని సూచించారు. పరిస్థితి విషమిస్తే రైతుల పక్షాన పోరాడుతామని హెచ్చరించారు.

మరో రైతు ఆత్మహత్య

- దిగుబడి రాక, అప్పులు తీర్చే మార్గం లేక..
- మనస్తాపంతో అన్నదాత బలవన్మరణం
- ఖమ్మం జిల్లా చిన్నమండవలో విషాదం

అగ్గిరాముడు (ఫైల్)

మధిర (చింతకాని), మార్చి 1 : సాగు చేసిన మిర్చి పంట దిగుబడి రాక.. ఎంతో కొంత చేతికొచ్చిన పంటకు గిట్టుబాటు ధర లేక.. పంట కోసం తెచ్చిన అప్పులు తీర్చే మార్గం లేక మనస్తాపంతో ఓ రైతు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన ఖమ్మం జిల్లా చిన్నమండవ గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి చోటుచేసుకున్నది. కుటుంబ సభ్యులు, బంధువుల కథనం ప్రకారం చిన్నమండవ గ్రామానికి చెందిన అగ్గిరాముడు (40) కొన్నేండ్లుగా సొంత భూమితోపాటు మరికొంత భూమిని కౌలుకు తీసుకొని పలు రకాల పంటలు సాగు చేస్తున్నాడు. ఈ ఏడాది మూడెకరాల్లో మిర్చి సాగు చేయగా ఆశించిన దిగుబడి రాకపోవడంతోపాటు చేతికొచ్చిన పంటకు గిట్టుబాటు ధర లభించక తీవ్రంగా నష్టపోయాడు. అప్పు రూ.5 లక్షలు, వాటికి సంబంధించిన వడ్డీ ఎలా తీర్చాలో తెలియక ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం వెంకటగిరితండాలో నెర్రెలుబారిన పొలం

మా పొలాలకు నీళ్లియ్యరా?

- తలాపున మల్లన్నసాగర్ ఉన్నా పంటలు ఎండుతున్నయ్
- దుబ్బాక ప్రాంత రైతుల ఆందోళన

దుబ్బాక, మార్చి 1 : సిద్దిపేట జిల్లా దుబ్బాక ప్రాంతంలో యాసంగిలో వేసిన వరిపంట ఎండిపోతున్నది. తలాపున మల్లన్నసాగర్ ఉన్నప్పటికీ సాగు నీటి సమస్యతో పొలాలు ఎండిపోతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. బీఆర్ఎస్ హయాంలో వేసవికి ముందే మల్లన్నసాగర్ నుంచి నీటిని విడుదల చేసి ఈ ప్రాంతంలోని చెరువులు, కుంటలు, చెక్‌డ్యామ్‌లు నింపేవారు. దీంతో సాగు నీటి ఇబ్బందులు ఎదురుకాలేదు. నీటి వసతి పెరగడంతో బీడు భూములు సైతం సాగులోకి వచ్చాయి. ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో పరిస్థితులు తలకిందులయ్యాయి. మల్లన్నసాగర్ నుంచి ప్రభుత్వం సకాలంలో నీటిని విడుదల చేయకపోవడంతో కూడవెల్లి వాగు ప్రవాహ సమీప గ్రామాల రైతులకు సమస్య తలెత్తింది. మరోవైపు మల్లన్నసాగర్-4ఎల్ డిస్ట్రిబ్యూటరీ కాల్వల నిర్మాణం పూర్తికాకపోవడంతో 10 గ్రామాల రైతులు సాగునీటి కష్టాలు తప్పడం లేదు. పొలాలు నెర్రెలు చాచి ఎండిపోతున్నాయి. రైతులు కన్నీరు పెడుతున్నారు.

లోకం పోకడ

వామ్మో.. ఇంకా మూడున్నరేండ్లు వుంది.. తలుచుకుంటేనే భయంగా వుంది!

పెన్‌పహాడ్ మండలం చిన్నగారకుంటతండాలో ఎండిన వరి పైరును పరిశీలించిన రైతులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

దండం పెడతా.. సాగుకు నీళ్లియ్యండి

› మొదటిపేజీ తరువాయి...

మంత్రిగా ఉన్నప్పుడు ఒక్క ఎకరం కూడా ఎండ లేదని, పుష్కలంగా నీళ్లతో మడికట్లలో చేపలు కూడా పట్టుకున్నాం' అని రైతులు తెలిపారు. ఏడేండ్ల తరువాత మళ్లీ ఇలా ఎండిన పంటను చూడాల్సి వస్తుందని అనుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గాజుల మల్కాపురంలో పొట్టదశలో ఉన్న పొలాన్ని కాపాడుకునేందుకు వాటర్ ట్యాంకర్‌తో నీళ్లు పెడుతున్న రైతు గుండా వెంకన్నను చూసి చలించిన జగదీశ్‌రెడ్డి భావోద్వేగానికి లోనై కంటతడి పెట్టారు. అనంతరం అక్కడికి వచ్చిన మీడియాతో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం పంటలను ఎండబెట్టి రైతుల ఉసురు తీస్తున్నదని, ఇచ్చేందుకు నీళ్లున్నా ఇసుక వ్యాపారం కోసం పంటలు ఎండబెడుతున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఒక్క కన్నెపల్లి పంప్ హౌస్ బటన్ ఆన్ చేస్తే పంటలన్నీ పండుతాయని తెలిపారు. 'కేసీఆర్ సర్కారులో గోదావరి జలాలను రైతులు వద్దనేంత వరకు ఇస్తే పంటలు బాగా పండించారు. ఇవ్వాల దద్దమ్మ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను అరిగోస పెడుతూ పంటలను ఎండబెడుతున్నది. చేతకాని ప్రభుత్వం పనికి రాదంటున్న కాళేశ్వరాన్ని మాకు అప్పగిస్తే మూడు రోజుల్లో చివరి ఎకరం వరకు నీళ్లు పారిస్తాం' అని సవాల్ విసిరారు. కేసీఆర్‌కు ఎక్కడ మంచి పేరు వస్తుందోనని రైతులను కష్టపెట్టడం బాధాకరమని అన్నారు. రైతాంగాన్ని నట్టేట ముంచేలా ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని మండిపడ్డారు. కేవలం కాల్వల్లో పారేందుకు గోదావరి నీళ్లు వదులుతూ చివరి వరకు రాక ముందే నీటిని బంద్ చేస్తుండటం దుర్మార్గమని పేర్కొన్నారు. నీటిని ప్రకటించిన షెడ్యూల్‌కు మూడు రోజుల తరువాత విడుదల చేసి, మూడు రోజుల ముందే బంద్ చేస్తున్నారని, దాంతో పొలాల్లోకి నీరు చేరడం లేదని తెలిపారు. తాము ఏది మాట్లాడినా రాజకీయం అనడం కాంగ్రెస్‌కు ప్యాషన్ అయ్యిందని విమర్శించారు. తాను రాజకీయం చేయడం లేదని.. నీళ్లు లేక ఎండిన పొలాల్లోకి గొర్లు, పశువులు వచ్చి మేస్తున్నది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం కనికరించి నీళ్లిస్తే వేసిన పంటలో కొంత మేరకైనా చేతికి వస్తుందని సూచించారు. దాంతోనైనా పెట్టుబడి వస్తదనే ఆశతో రైతులు ఉన్నారని తెలిపారు. రైతుల పట్ల దుర్మార్గంగా వ్యవహరించడం మంచి పద్ధతి కాదని అన్నారు. సూర్యాపేట జిల్లా రైతుల తరఫున చేతులెత్తి దండం పెట్టి అడుగుతున్నా.. దయచేసి నీళ్లిచ్చి రైతులను ఆదుకోవాలని జగదీశ్‌రెడ్డి కోరారు.

కొల్లాపూర్‌లో కాంగ్రెస్ గూండాగిరీ

మరో బీఆర్ఎస్ నేతపై హత్యాయత్నం

కాంగ్రెస్ గూండాల దాడిలో గాయపడ్డ బీఆర్ఎస్ కార్యకర్త

దాడిలో గాయపడి దవాఖానలో చికిత్స పొందుతున్న బీఆర్ఎస్ కార్యకర్తలను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

కొల్లాపూర్/కోడేరు, మార్చి 1 : నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ గూండాలు పేట్రేగిపోతున్నారు. బీఆర్ఎస్ నేతలపై వరుస దాడులకు పాల్పడుతున్నారు. మొన్న చిన్నంబావి మండలం లక్ష్మీపల్లిలో శ్రీధర్‌రెడ్డి హత్య నిన్న పెద్దకొత్తపల్లి మండలం సాతాపూర్‌లో మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ పరమేశ్ నాయుడిపై దాడి.. నేడు కోడేరు మండలం నార్యానాయక్ తండాలో ఏడుగురిపై హత్యాయత్నం.. ఇలా కాంగ్రెస్ నాయకుల దౌర్జన్యాలు రోజురోజుకూ పేట్రేగిపోతున్నాయి. శుక్రవారం ఎమ్మెల్సీ కవిత సింగోటం ఆలయానికి విచ్చేయగా.. కోడేరు మండలం నార్యానాయక్ తండాకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు రాజునాయక్ ఆధ్వర్యంలో పలువురు వెళ్లి స్వాగతం పలికారు. విషయం తెలుసుకొన్న అదే గ్రామానికి పాండునాయక్‌తోపాటు పలువురు కాంగ్రెస్ నేతలు మనసులో పెట్టుకొని రాత్రికి రాజు ఇంటిపై దాడికి యత్నించారు. దీంతో సదరు నేత భయంతో తలుపులు పెట్టుకొని 100కు డయల్ చేశాడు. తర్వాత రాజు తమ్ముడు రవి కోడేరు ఎస్సైకి ఫోన్‌చేసి విషయం చెప్పగా.. 'నువ్వు ఫోన్ పెట్టకుంటే సినిమా చూపిస్తా'.. అంటూ బెదిరింపులకు దిగినట్టు రవి వాపోయాడు. కొద్దిసేపటి తర్వాత కాంగ్రెస్ గూండాలు అక్కడికి నుంచి వెళ్లిపోయారు. శనివారం ఉదయం 6 గంటల ప్రాంతంలో మళ్లీ రాజు ఇంటిపై దాడి చేశారు. మారణాయుధాలతో హత్యాయత్నానికి పాల్పడగా.. రాజు కుటుంబ సభ్యులు భయంతో పరుగులు తీశారు. అయినా వదలకుండా పట్టుకొని గొడ్డళ్లు.. కత్తులతో దాడి చేశారు. రక్తాలు కారుతుండగానే రాజు కుటుంబ సభ్యులు కోడేరు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లగా పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. చికిత్స కోసం ప్రభుత్వ దవాఖానకు వెళ్లగా.. అప్పటికే కార్లల్లో వచ్చి అక్కడ మాటు వేసిన పాండు అనుచరులు దవాఖాన ఎదుటే వీరిపై కత్తులతో మరోసారి దాడి చేశారు. కొల్లాపూర్ బీఆర్ఎస్ నాయకులు అక్కడికి చేరుకొని గాయపడిన వారిని ప్రైవేటు దవాఖానకు తరలించారు. మంత్రి జూపల్లి కృష్ణారావు అండతోనే దాడులు జరుగుతున్నాయని మాజీ ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి ఆరోపించారు.

బీఆర్ఎస్ శ్రేణులపై దాడులేనా మార్పంటే?

- కొల్లాపూర్‌లో కాంగ్రెస్ మార్క్ ఎమర్జెన్సీ
- మాజీ మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, మార్చి 1(నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ శ్రేణులపై కాంగ్రెస్ నాయకుల దాడులు దుర్మార్గమని మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. సూర్యానాయక్‌తండాలో బీఆర్ఎస్ నాయకులపై దాడిని ఆయన ఎక్స్ వేదికగా ఖండించారు. రాష్ట్రంలో రోజురోజుకూ హింసాత్మక ఘటనలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మార్పు తెస్తానని అధికారంలోకి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ శ్రేణులను బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై దాడులకు ఉసిగొల్పుతున్నారని ఆరోపించారు. జూపల్లి కృష్ణారావు నేతృత్వంలో కాంగ్రెస్ మార్క్ ఎమర్జెన్సీ అమలవుతున్నదని మండిపడ్డారు. మంత్రి అనుచరులు దాడులకు దిగుతున్నా పోలీసులు పట్టించుకోకపోవడం సరికాదని మండిపడ్డారు. ఎన్ని దాడులకు దిగినా, బీఆర్ఎస్ నేతలు ప్రజల తరపున పోరాడుతూనే ఉంటారని స్పష్టంచేశారు.

కాంగ్రెస్ దౌర్జన్యాన్ని ప్రజలే సమాధి చేస్తరు

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైర్

హైదరాబాద్, మార్చి 1 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ అధికార దౌర్జన్యాన్ని ప్రజలే సమాధి చేస్తారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ నాయకులపై కాంగ్రెస్ గూండాల దాడిని తీవ్రంగా ఖండించారు. నార్యనాయక్‌తండాలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై దాడి అత్యంత హేయమైన చర్య అని మండిపడ్డారు. సతాపూర్‌లో జరిగిన దాడిని మరవముందే కాంగ్రెస్ గూండాలు అడ్డూఅదుపూ లేకుండా పెట్రేగిపోతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. కాంగ్రెస్ నేతలు వరుస దాడులకు పాల్పడుతున్నా పోలీసులు ప్రేక్షక పాత్ర వహిస్తూ వారికి వత్తాసు పలుకుతున్నారని విమర్శించారు. ప్రజాపాలన అంటే పీకల్లోతు కష్టాల్లో ఉన్న ప్రజల గొంతు వినిపించిన వారిపై విచక్షణా రహితంగా దాడిచేయడమేనా ? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలో ఫ్యాక్షన్ తరహా దాడులు పెరిగిపోయాయని ఆగ్రహం వ్యక్తంచేశారు.

దేవరుప్పుల మండలం పొట్టిగుట్టతండాలో వరి పరిశీలిస్తున్న ఎర్రబెల్లి దయాకర్‌రావు (ఫైల్)

ఎర్రబెల్లి హెచ్చరికతో పొలాలకు నీళ్లు

- ఫలించిన ఎర్రబెల్లి దయాకర్‌రావు కృషి
- గోదావరి జలాలు విడుదల చేసిన అధికారులు

పాలకుర్తి, మార్చి 1 : జనగామ జిల్లా పాలకుర్తి నియోజకవర్గంలో వరి పొలాలు రైతుల కండ్లముందే ఎండుతుంటే మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు చూసి తట్టుకోలేకపోయారు. తాను అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా రైతులు, ప్రజల పక్షమేనని మరోసారి నిరూపించారు. మూడు రోజుల క్రితం పాలకుర్తి, దేవరుప్పుల మండలాల్లో పర్యటించిన ఎర్రబెల్లి ఎండిపోయిన వరి పొలాలను పరిశీలించి చలించిపోయారు. వెంటనే నీటిని విడుదల చేయాలని దేవాదుల సీఈతోపాటు ఇతర అధికారులతో ఫోన్‌లో పలుమార్లు మాట్లాడారు. రెండు మూడు రోజుల్లో దేవాదుల 4ఎల్ ద్వారా నీళ్లు వదలకపోతే రైతులతో కలిసి ధర్నా చేస్తానని హెచ్చరించారు. దీంతో దిగివచ్చిన అధికారులు శనివారం దేవాదుల 4ఎల్ ద్వారా గోదావరి జలాలను విడుదల చేశారు. రైతుల బాధలను చూసి గోదావరి జలాలను విడుదల చేసిన దేవాదుల నీటిపారుదల శాఖ అధికారులకు ఎర్రబెల్లి ధన్యవాదాలు తెలిపారు.

'అడ్లూరి' ఆరోపణలు హాస్యాస్పదం

మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

హైదరాబాద్, మార్చి 1(నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ నేతలు హరీశ్‌రావు, కేటీఆర్, కవితపై ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆరోపణలు హాస్యాస్పదమని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆక్షేపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతుంటే ఓర్వలేకే ఆయన ఇష్టారీతిన మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. గతంలో ధర్మపురి అసెంబ్లీ ఎన్నిక రీకౌంటింగ్ విషయంలోనూ సత్యదూరమైన ఆరోపణలు చేశారని గుర్తుచేశారు. ఎస్ఎల్‌బీసీ ఘటనపై కాంగ్రెస్ ప్రభుత్వం వేగంగా స్పందించిందని లక్ష్మణ్‌కుమార్ చెప్పుకోవడం అత్యంత దుర్మార్గమన్నారు. కార్మికుల ప్రాణాలను కాపాడడంలో ప్రభుత్వం విఫలమైన విషయాన్ని విస్మరించి ప్రతిపక్ష బీఆర్ఎస్ నేతలపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని పేర్కొన్నారు.

హరీశ్‌రావుపై కేసు కక్షసాధింపే

బీఆర్ఎస్ అధికార ప్రతినిధి దాసోజు

హైదరాబాద్, మార్చి 1 (నమస్తే తెలంగాణ): కక్షసాధింపులో భాగంగానే మాజీ మంత్రి హరీశ్‌రావుపై కాంగ్రెస్ ప్రభుత్వం మరో అక్రమ కేసు పెట్టిందని బీఆర్ఎస్ అధికార ప్రతినిధి దాసోజు శ్రవణ్ ఆరోపించారు. హైకోర్టు విచారణలో ఉన్న ఒకే అంశంపై మళ్లీ బాచుపల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేయడమంటే న్యాయవ్యవస్థను అవహేళన చేయడమేనని మండిపడ్డారు. ప్రత్యర్థులను అణచివేయడానికి, ప్రజాస్వామ్యవాదులను వేధించడానికి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పోలీసులను పూర్తిగా రాజకీయ పావులుగా వాడుకుంటున్నదని మండిపడ్డారు. బీఆర్ఎస్ నేతలపై ప్రత్యేకంగా హరీశ్‌రావు లాంటి నాయకులపై కేసులు పెట్టడమే పరిపాలన అనుకుంటే అంతకన్నా మూర్ఖత్వం మరొకటి ఉండదని పేర్కొన్నారు. సీఎం చెప్పిందల్లా వింటూ పోలీసులు అధికార పార్టీ చేతిలో కీలుబొమ్మలా మారకూడదని ఆయన సూచించారు. న్యాయాన్ని పరిరక్షించాల్సిన పోలీసులే అన్యాయంగా వ్యవహరించడం సరికాదని హితవుపలికారు.

జీవో ఇచ్చేదాకా పోరాటం

- సర్క్యులర్‌తో సరిపెడితే ఊరుకోం
- ఈ 17న ధర్నా తాత్కాలిక వాయిదా
- త్వరలో గౌడజన మహాసభ
- నీరా ప్రాసెసింగ్ యూనిట్ల సందర్శన
- గౌడ సంఘాల ఉద్యమ ప్రణాళిక
- గౌడన్నల్లారా ఐక్యంగా పోరాడదాం: స్వామిగౌడ్, శ్రీనివాస్‌గౌడ్

మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, చిత్రంలో మాజీ ఎమ్మెల్యేలు, గౌడ నేతలు

హైదరాబాద్, మార్చి 1 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్ నెక్లెస్‌రోడ్‌లో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన నీరాకేఫ్ గౌడజాతి ఆత్మగౌరవానికి ప్రతీక అని 43 గౌడ సంఘాలు స్పష్టంచేశాయి. నీరాకేఫ్‌ను ప్రైవేటు వ్యక్తులకు కాకుండా భేషరతుగా తెలంగాణ రాష్ట్ర కల్లుగీత పారిశ్రామిక ఆర్థిక సహకార సంస్థకు అప్పగించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాయి. పర్యాటక అభివృద్ధి సంస్థతో సంబంధం లేకుండా నీరా కేఫ్‌ను కల్లుగీత కార్పొరేషన్‌కు అప్పగించాలని సంఘాల నేతలు డిమాండ్ చేశారు. గౌడ, కల్లుగీత కార్మిక సంఘాల సమన్వయ వేదిక పిలుపుమేరకు ఈ నెల 17న వేలాదిమందితో తలపెట్టిన మహాధర్నాను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్టు తెలిపారు. తాము కోరినట్టుగా నీరాకేఫ్, అక్కడి స్థలం కల్లుగీత కార్పొరేషన్‌కు అప్పగించకపోతే 17న మహాధర్నా చేపడతామని హెచ్చరించారు.

నీరా కేఫ్ గౌడుల ఆత్మగౌరవ ప్రతీక

నెక్లెస్‌రోడ్‌లోని నీరాకేఫ్‌లో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, శాసనమండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్ నేతృత్వంలో 43గౌడ సంఘాల ప్రతినిధులు శనివారం సమావేశమయ్యారు. నీరా కేఫ్ గౌడన్నల ఆత్మగౌరవ ప్రతీక అని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. దానిని ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కల్లుగీత కార్పొరేషన్‌కు అప్పగిస్తామని బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ హామీ మేరకు మహాధర్నాను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నామని చెప్పారు. పూర్తి హక్కులతో కల్లుగీత కార్పొరేషన్‌కు అప్పగించకపోతే యథావిధిగా పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. బీసీ కార్పొరేషన్ నిధులతో నీరాకేఫ్‌ను నిర్మిస్తే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కక్షగట్టి తొలగిస్తున్నదని ఆయన మండిపడ్డారు. ప్రభుత్వం ఇచ్చిన నామమాత్రపు సర్క్యులర్‌ను వెనక్కి తీసుకొని.. ఎలాంటి నిబంధనలు, షరతులు లేకుండా కల్లుగీత కార్పొరేషన్‌కు అప్పగించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే ఈనెల 17 తర్వాత భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు. నీరాకేఫ్‌లో తొలగించిన అద్దాలను, కృత్రిక చెట్లను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

రాజకీయాలకు అతీతంగా పోరాటం చేద్దాం

హక్కుల సాధన కోసం రాజకీయాలకు అతీతంగా గౌడ్స్ అంతా సంఘటితమై పోరాడాల్సిన అవసరముందని శాసనమండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్ చెప్పారు. కల్లుగీసే సమయంలో అనేక మంది వృత్తిదారులు మృత్యువాత పడ్డారని తెలిపారు. వారికి ప్రభుత్వం వెంటనే 5 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. నీరా కేఫ్ వేదికగా త్వరలో గౌడ మహాసభ ఏర్పాటు చేద్దామని పిలుపునిచ్చారు. ఈ సభకు రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది గౌడన్నలు తరలిరావాలని పిలుపునిచ్చారు. నీరాకేఫ్‌ను గౌడన్నలకు ఇవ్వకపోతే.. ఎన్ని రోజులైనా ధర్నా చేస్తామని తేల్చిచెప్పారు. ఇక నుంచి గౌడ మహాజనసభ పిలుపు మేరకు మాత్రమే ఉద్యమించాలని స్పష్టంచేశారు. సమావేశంలో మాజీ మంత్రి రాజేశంగౌడ్, తెలంగాణ రాష్ట్ర కల్లుగీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు భిక్షమయ్యగౌడ్, కొడూరి సత్యనారాయణగౌడ్, మాజీ ఎమ్మెల్సీ గంగాధర్‌గౌడ్, గౌడ సంఘాల నాయకులు పంజాల జైహింద్ గౌడ్, పల్లె లక్ష్మణ్‌రావుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మా ఉద్యమం ఎవరికీ వ్యతిరేకం కాదు

మా జాతి హక్కుల కోసం, మా ఆత్మ గౌరవం కోసం.. గౌడ జాతి అస్తిత్వం కోసం మాత్రమే మేము పోరాడుతున్నాం. మంచి చేసిన ప్రభుత్వాలకు అండగా ఉంటాం. చెడు చేయాలని చూసే ప్రభుత్వాలను బొందపెడతాం. గౌడన్నల కోసం ఆలోచన చేయాలి. మద్యం షాపులలో గౌడలకు 25 శాతం రిజర్వేషన్‌లు కల్పించాలని డిమాండ్ చేశారు. వనాల పెంపకానికి 5 ఎకరాల భూమి కేటాయించాలి. వృత్తిదారులపై నార్కోటిక్, పోలీస్ దాడులు ఆపాలి.

- పల్లె రవికుమార్‌గౌడ్, కార్పొరేషన్ మాజీ చైర్మన్

టూరిజం ఎండీని సస్పెండ్ చేయాలి

ప్రభుత్వాన్ని తప్పు దారి పట్టిస్తున్న టూరిజం ఎండీ ప్రకాశ్‌రెడ్డిని సస్పెండ్ చేయాలి. గౌడ సంఘాల ఉద్యమాన్ని నీరుగార్చే ప్రయత్నం చేయకూడదు. భేషరతుగా గీత కార్పొరేషన్ సంస్థకు నీరా కేఫ్‌ను నిర్వహణ అప్పగించాలి. ప్రభుత్వాన్ని పక్కదారి పట్టించేలా ప్రవర్తిస్తున్న ఎండీ ప్రకాశ్ రెడ్డి సర్క్యులర్ ఇవ్వడం హాస్యాస్పదంగా ఉంది. ఎలాంటి టెండర్ లేకుండా ప్రైవేట్ వ్యక్తి అయిన శంకర్‌రెడ్డికి కేఫ్‌ను కట్టబెట్టడం దారుణం. ప్రభుత్వం స్పందించకపోతే మూల్యం తప్పదు.

- యెలికట్టె విజయ్‌కుమార్‌గౌడ్

త్వరలో నీరాకేఫ్ ఎత్తివేత?

గౌడన్నల పోరు.. తలొగ్గిన సర్కారు

- నీరాకేఫ్ గీత పారిశ్రామిక కార్పొరేషన్‌కే: మంత్రి పొన్నం
- ఆగమేఘాలపై ప్రభుత్వం సర్క్యులర్
- 'నమస్తే' కథనాలతో దిగివచ్చిన సర్కారు

హైదరాబాద్, మార్చి 1 (నమస్తే తెలంగాణ): నీరాకేఫ్‌ను పూర్తిస్థాయిలో గీత పారిశ్రామిక కార్పొరేషన్‌కు అప్పగించడానికి నిర్ణయం తీసుకున్నట్టు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. నీరాకేఫ్‌కు సంబంధించి టూరిజం, ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో పాటు ఎండీ ప్రకాశ్‌రెడ్డితో త్వరలో సమావేశం ఏర్పాటు చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారు. శనివారం మినిస్టర్ క్వార్టర్స్‌లో మంత్రిని గౌడ సంఘాల నేతలు మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, పల్లె లక్ష్మణ్‌రావు తదితరులు కలిశారు. నీరాకేఫ్, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహం, గౌడ సంఘం భవన నిర్మాణానికి సంబంధించిన అంశాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా పొన్నం మాట్లాడుతూ గౌడ సంఘం భవన నిర్మాణానికి ప్రముఖులందరినీ కలుపుకుని మార్చి తర్వాత భవన నిర్మాణాన్ని ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ట్యాంక్ బండ్ మీద సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహానికి స్థలం పరిశీలన అంశాన్ని సీఎం రేవంత్‌రెడ్డి తనకు అప్పగించారని తెలిపారు.

సర్కారు సర్క్యులర్ జారీ

గౌడ సంఘాల నేతలు మంత్రి పొన్నంతో సమావేశమైన తర్వాత నీరాకేఫ్‌ను కల్లుగీత కార్పొరేషన్‌కు అప్పగించేందుకు ప్రభుత్వం సూత్రప్రాయంగా అంగీకారం తెలిపింది. ఈ మేరకు ఆగమేఘాల మీద సర్క్యులర్ జారీ చేసింది. మరోవైపు గౌడన్నల ఉపాధి కోసమే నిర్మించిన నీరాకేఫ్‌ను ఇతర వర్గాల వారికి ధారాదత్తం చేసేందుకు ప్రభుత్వం యత్నించిన విషయాన్ని 'నమస్తే తెలంగాణ' పసిగట్టింది. ఫిబ్రవరి 23న 'త్వరలో నీరాకేఫ్ ఎత్తివేత?' అనే శీర్షిక కథనం ప్రచురించింది. దీంతో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ నేతృత్వంలో గౌడ సంఘాలు, వారి అనుచరులు నీరాకేఫ్‌ను సందర్శించి.. పథకం ప్రకారం నీరాకేఫ్‌ను ఆగంపట్టిస్తున్న తీరును ఎండగట్టారు. ఈ నేపథ్యంలో నీరాకేఫ్, నీరా ప్రాసెసింగ్ యూనిట్ల అన్యాక్రాంతంపై 'నమస్తే తెలంగాణ' నాటి నుంచి వరసగా కథనాలు రాస్తూనే ఉంది. అందుకు అనుగుణంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గౌడ సంఘాలు వివిధ రూపాల్లో నిరసనలు తెలియజేస్తూ, సమావేశాలు పెడుతుండటంతో పాటు ఈ నెల 17న హైదరాబాద్‌లో మహాధర్నాను చేపట్టాయి. దీంతో ప్రభుత్వం ఆగమేఘాల మీద కొన్ని షరతులతో కూడిన సర్క్యులర్ ఇచ్చింది. వరుస కథనాలు రాసిన 'నమస్తే తెలంగాణ'ను గౌడ సంఘాల నేతలు అభినందించారు.

బీసీఏఎఫ్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, చిత్రంలో బీసీఏఎఫ్ నేతలు

బీసీ ఆజాది ఫెడరేషన్ పోస్టర్ ఆవిష్కరణ

హైదరాబాద్, మార్చి 1 (నమస్తే తెలంగాణ): బీసీ ఆజాది ఫెడరేషన్ పోస్టర్‌ను రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర బంజారాహిల్స్‌లోని క్యాంప్ కార్యాలయంలో శనివారం ఆవిష్కరించారు. బీసీల న్యాయమైన హక్కుల సాధనకు ఫెడరేషన్ 'మేమెంతో.. మాకంత' నినాదంతో త్వరలో పల్లెబాట కార్యక్రమం చేపట్టనున్నది. కార్యక్రమంలో ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు జక్కని సంజయ్‌కుమార్, నాయకులు గౌరిశెట్టి వినోద్, ఈ సిద్ధార్థ, ఏ నరేశ్ తదితరులు పాల్గొన్నారు.